క్లుప్తంగా

శ్మశానవాటికను ఆక్రమించారని ధర్నా



కేసముద్రం: ఎస్సీకాలనీకి సంబంధించిన శ్మశానవాటిక స్థలాన్ని కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించారని ఆరోపిస్తూ ఇనుగుర్తి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాలనీ వాసులు శుక్రవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు ఆందోళనకారులు మాట్లాడుతూ.. ఇనుగుర్తిలో 50ఏళ్లుగా శ్మశానవాటిక ఉందని, ఇప్పుడు కొందరు వ్యక్తులు అక్రమంగా స్థలాన్ని ఆక్రమించుకున్నారని, వెంటనే వారిపై చర్య తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

డీఈఓను తొలగించాలి

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల పదోన్నతుల్లో తప్పుల మీద తప్పులు చేస్తున్న డీఈఓను తొలగించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.మురళీకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సీనియార్టీ లిస్టులో ముందున్న వారికి పదోన్నతి కల్పించకుండా వేరే వారికి పదోన్నతి కల్పించారన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్, నాయకులు సంజీవ, ప్రవీణ్, వెంకట్, ప్రసాద్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

డోర్నకల్: స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్‌లో శుక్రవారం అగ్నిమాపక సేవలపై ఫైర్‌స్టేషన్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఫైర్‌స్టేషన్ ద్వారా అందుతున్న సేవలతోపాటు వంట చేసే సమయంలో గ్యాస్ సిలెండర్ ద్వారా ప్రమాదాల నుంచి రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, నాయకుడు మాదా శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెల మృతి

కురవి: మండలంలోని తట్టుపల్లి గ్రామంలో శుక్రవారం కుక్కల దాడిలో రెండు గొర్రెలు మృతి చెందిన సంఘటన జరిగింది. గ్రామంలో నూకల లింగయ్య అనే గొర్రెల కాపరికి చెందిన గొర్రెల మందపై ఐదు కుక్కలు దాడికి పాల్పడ్డాయి. ఈ ఘటనలో రెండు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో రూ.20వేల నష్టం వాటిల్లిందని బాధితుడు విలపించాడు.

ఆర్సీఓకు వినతి

కురవి: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్సీఓ హరిసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ధరావత్ శ్రీరామ్‌నాయక్, రమేష్ నాయక్, స్వామి నాయక్ పాల్గొన్నారు.

మిరపనారుకు చీరల రక్ష..!



మహబూబాబాద్ రూరల్: మండలంలోని నడివాడ గ్రామానికి చెందిన రైతు రాజబోయిన శ్రీనివాస్ మిరప నారుకు రక్షణగా చీరలు అడ్డుగా పెట్టి పక్షులు, జంతువుల బారినుంచి నారును కాపాడుకుంటున్నాడు.

హక్కుల కోసం ఉద్యమించాలి



గంగారం: కొమురం భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ



నెహ్రూసెంటర్: జెండా ఎగురవేస్తున్న యాప సీతయ్య, తదితరులు



మహబూబాబాద్ రూరల్: సర్ద్రలగూడెం గ్రామంలో..



డోర్నకల్: బూరుగుపాడులో..



కురవి: తులస్యా తండాలో..

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఆదివాసీలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జెండా ఎగురువేసి, కొమురం భీం విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అడవులపై ఆదివాసీలకు ఉన్న హక్కులను హరించే యత్నం చేస్తున్నారన్నారు. హక్కుల కోసం ఆదివాసీలు ఐక్యతగా ఉద్యమించాలన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



గూడూరు: నివాళులర్పిస్తున్న ఆదివాసీలు



బయ్యారంలో..



గార్లలో..



తొర్రూరులో..

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

గూడూరు: శ్రావణ మాసం మొదటి శుక్రవారం, నాగుల పంచమిని పురస్కరించుకొని స్థానిక సనాతన శివాలయంలో భక్తులు కుటుంబ సమేతంగా హాజరై పూజలు నిర్వహించారు. శివలింగానికి పంచామృత అభిషేకాలు చేశారు. ఆలయ పూజారి సతీష్‌పాండ్యే భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మహబూబాబాద్ రూరల్: నాగుల పంచమి పురస్కరించుకొని శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నాగేంద్ర స్వామి, నాగులమ్మ తల్లి దేవాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

కొత్తగూడ: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు నాగుల పంచమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.



గూడూరు: పూజలు చేస్తున్న భక్తులు



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మరిపెడ రూరల్: మరిపెడ సబ్‌డివిజన్ పరిధిలోని ఉల్లెపల్లి, తానంచర్ల, ఎల్లంపేట సెక్షన్ పరిధిలోని ఎల్లంపేట, గిరిపురం, నర్సింహులపేట గ్రామాల్లో శనివారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ లోకేనాథ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు.

బయ్యారం: మండలంలోని బయ్యారం, కొత్తపేట సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 10నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని విద్యుత్‌శాఖ ఏఈ సుమన్ శుక్రవారం తెలిపారు.

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని కొత్త బజారు, కంకరబోర్డు, సిగ్నల్‌కాలనీ, ఇందిరాకాలనీ, బ్యాంక్ కాలనీ ఏరియాల్లో నేడు ఉదయం 7గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ నవ్యశ్రీ తెలిపారు.

దంతాలపల్లి: మండంలోని రేపోణి, వేములపల్లి ఉపకేంద్రాలలో నేడు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ నిలివేస్తామని విద్యుత్ అధికారి ప్రవీన్ తెలిపారు.

కేసముద్రం: కేసముద్రం సబ్‌స్టేషన్‌లో నేడు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాజు తెలిపారు.

కురవి: మండల కేంద్రంతోపాటు, నల్లెల, తిర్మలాపురం, అయ్యగారిపల్లి గ్రామాల్లో నేడు ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శారద తెలిపారు.

తొర్రూరు: తొర్రూరు, హరిపిరాల, చెర్లపాలెం, వడ్డె కొత్తపల్లి గ్రామాల్లో నేడు ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ చలపతిరావు తెలిపారు.

పరిమితికి మించి వైద్యం చేస్తే చర్యలు

బయ్యారం/నెల్లికుదురు: ఆర్ఎంపీలు పరిధి దాటి వైద్యం చేయొద్దని గార్ల–బయ్యారం సీఐ రవికుమార్ సూచించారు. మండలంలోని ఆర్ఎంపీలతో శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే చికిత్స చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించి వైద్యం చేసి ఎవరికైనా ప్రాణహాని తలపెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

మరిపెడ: గ్రామీణ వైద్యులు వారికి ఉన్న పరిమితి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని సీఐ హత్తిరాంనాయక్ అన్నారు. శుక్రవారం మరిపెడ పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఆర్ఎంపీ వైద్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సైలు తాహెర్‌బాబా, సంతోష్ పాల్గొన్నారు.



బయ్యారం: ఆర్ఎంపీలతో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

కేసముద్రం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆర్ఎంపీ వైద్యులకు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థినులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ, ఎస్సై

మహబూబాబాద్ అర్బన్: సైబర్ నేరాలపై ప్రజలు, యువత, విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల హోలీ ఏంజిల్స్ పాఠశాలలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సైబర్‌నేరాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో షీటీం ఎస్సై సునంద, పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, ఏఎస్సై ఆనందం పాల్గొన్నారు.

పెద్దవంగర: సైబర్ నేరాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని ఎస్సై ఉపేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నవంగర కస్తూర్బాగాంధీ పాఠశాల్లో విద్యార్థులకు సైబర్ నేరాలు, షీటీంలపై అవగాహన కల్పించారు. అలాగే డ్రగ్స్, గుడుంబా, సైబర్ భద్రత, స్నేహపూర్వక పోలీసింగ్, షీ టీమ్స్ అనే అంశాలపై చిత్ర లేఖనం పోటీల్లో పాల్గొని అంశం ప్రతిబింబించేలా చిత్రీకరించి తమకు ఈనెల 13 వరకు సమర్పించాలన్నారు.

మహబూబాబాద్ రూరల్: విద్యార్థులు విద్యతోపాటు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై అవగాహన కలిగి ఉండాలని రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై దీపికరెడ్డి, హెచ్ఎం బి.సక్రు, ఫిజికల్ డైరెక్టర్ ధరావత్ మోహన్, ఏఎస్సై రమేష్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం

గూడూరు: ప్రతీ ఒక్కరు పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వారికి ఒక రోజు డ్రైడేను పాటిస్తూ, మురికి నీటిని పడబోయాలని డాక్టర్ రాంబాబు అన్నారు. మండలంలోని తీగలవేణి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష్మీపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మహబూబాబాద్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గోపాలపురం కాలనీలో శుక్రవారం స్వచ్ఛదనం–పచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. మున్సిపాలిటీ పరిధిలోని హస్తినాపురం కాలనీలోని ఎస్సీ బాలుర హాస్టల్ ఎదుట ఉన్న రోడ్డు బురదమయంగా మారడంతో చైర్మన్ మరమ్మతు పనులు చేపట్టారు. అలాగే 24వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న ఆధ్వర్యంలో మురుగు నీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. 22వ వార్డు పరిధిలోని కొండపల్లి గోపాల్‌రావు నగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటడంతోపాటు నిల్వ నీటిలో ఆయిల్‌బాల్స్ వేశారు. 26వ వార్డులో కౌన్సిలర్ స్వాతి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్, ఏఈ సురేష్, డొలాగర్ శంకర్, మార్నేని కిరణ్, కరుణాకర్, రాజేష్, క్రాంతి, వార్డు ఆఫీసర్ నాగేశ్వర్‌రావు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కురవి: స్వచ్ఛదనం–పచ్ఛదనం కార్యక్రమం చివరి రోజున శుక్రవారం మండలంలోని నల్లెల్ల గ్రామంలోని పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి నర్సింహస్వామి తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీఓ వీరబాబు, ఎంపీఓ మహమూద్ గౌస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: మండలంలోని అబ్బాయిపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డితో కలిసి ఎంపీడీఓ విజయ మొక్కలు నాటారు. అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి గ్రామ అభివృద్ధి కోసం రూ.20వేల నగదు ఎంపీడీఓకు అందజేశారు.



మహబూబాబాద్: మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, తదితరులు

నెల్లికుదురు: స్థానిక ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డితో కలిసి ఎంపీడీఓ బాలరాజు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీఓ పద్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో శుక్రవారం శ్రమదానం నిర్వహించారు. అలాగే జిల్లా కేంద్రంలోని కంకరబోడ్ ఈద్గా ఆవరణలో కేవైపీ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు నీలం కృష్ణవేణి, ఈద్గా కమిటీ అధ్యక్షుడు ఇబ్రహీం, కేవైపీ యూత్ అధ్యక్షుడు యాకూబ్ పాషా, అక్రం పాల్గొన్నారు.

గూడూరు: ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం పచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఫారెస్టు శాఖ ఆధ్వర్యంలో మచ్చర్ల బీట్ పరిధిలోని సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లను సేకరించి శుభ్రం చేశారు.



గూడూరు: గద్దెల వద్ద ప్లాస్టిక్ బాటిళ్లు సేకరించిన అటవీ శాఖ సిబ్బంది



మహబూబాబాద్ రూరల్: మొక్క నాటుతున్న ఈద్గా కమిటీ బాధ్యులు

దంతాలపల్లి: మండలంలో వివిధ గ్రామాలలో అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వీరన్న, ఎంపీడీఓ, వివేక్ రామ్, ఎంపీఓ అప్సర్‌పాషా పాల్గొన్నారు.

డోర్నకల్: మండలంలోని వెన్నారం గ్రామంలో ప్లాస్టిక్ వస్తువులతో కలిగే ముప్పుపై అవగాహన కలిగించారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌నాయక్, ఎంపీఓ మున్వర్ బేగ్ పాల్గొన్నారు.

గార్ల: స్థానిక జూనియర్ కళాశాలలో ఎంపీడీఓ మంగమ్మ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చాంప్లా, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏ విడుదల చేయాలి

తొర్రూరు: ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కొరివి సుధాకరాచారి అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఎస్టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సత్కరించారు.

దంతాలపల్లి: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను, సప్లమెంటరీ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

రంగులు మారుస్తూ.. అందరి దృష్టిని ఆకర్షిస్తూ..

జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో శుక్రవారం ఊసరవెల్లి సందడి చేసింది. స్టేషన్ ఆవరణలో పండ్లు అమ్ముకునే కోట శ్రీను బండి వద్ద ప్రత్యక్షమైంది. ప్రయాణికులు ఊసరవెల్లిని ఆసక్తిగా తిలకిస్తూ తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు.

\- మహబూబాబాద్ రూరల్



ఊసరవెల్లి

డీఐఈఓకు అభినందనలు

నెల్లికుదురు: ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న కళాశాల విద్యార్థులకు సర్వతో ముఖాభివృద్ధికి సహకరించాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు నెలకుర్తి నాగిరెడ్డి డీఐఈఓ సీహెచ్ మధార్‌ను కోరారు. డీఐఈఓగా బాధ్యతలు చేపట్టిన మధార్‌ను మహబూబాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు కందికొండ బాబు, దేశెట్టి యాకన్న, కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీలు

నెల్లికుదురు: మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఎస్సై చిర్ర రమేష్ బాబు శుక్రవారం సందర్శించారు. విద్యార్థులు డ్రాయింగ్ కాంపిటేషన్‌లో పాల్గొని డ్రగ్స్, గుడుంబా, సైబర్, రోడ్ సేఫ్టీ, ఫ్రెండ్లీ పోలీసింగ్, షీటీం వంటి అంశాలపై డ్రాయింగ్ వేసి ఈనెల 13వరకు పోలీస్‌స్టేషన్‌కు పంపించాలన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

గూడూరు: ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎక్కడ పనిచేసినా ఆ పాఠశాలలోని విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఉపాధ్యాయులు బానోతు బాలాజీ, బిజ్జ సంపత్ అన్నారు. మండలంలోని సీతానగరం, కొమ్ములవంచ పాఠశాలలో పనిచేసిన ఇద్దరు ఉపాధ్యాయుల వీడ్కోలు సమావేశం పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. వారిని విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

దంతాలపల్లి: మండంలోని దాట్ల గ్రామ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పని చేసి బదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ

కురవి: మండలంలోని బలపాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం మండలంలోని సింగారం గ్రామ పూర్వ విద్యార్థి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న చెన్నోజు శరత్‌కుమార్ తన తండ్రి జ్ఞాపకార్థం 50మంది విద్యార్థులకు రూ.6,500 విలువైన టై, బెల్టులు, ఐడీ కార్డులను ఏఏపీసీ చైర్మన్ గంధం పద్మ, ప్రత్యేక అధికారి నర్సింహారెడ్డి చేతుల మీదుగా అందించారు.

కష్టపడి చదివితే ఉన్నతస్థాయికి



డిక్షనరీలు అందజేస్తున్న ప్రేమలత

పెద్దవంగర: విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నతస్థాయికి చేరుకుంటారని తహసీల్దార్ మహేందర్ పేర్కొన్నారు. మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చిన్నవంగర కస్తూర్బాగాంధీ విద్యార్థులకు టీజీఎస్ ఆర్టీసీ తొర్రూరు డిపోలో విధులు నిర్వహిస్తున్న విజిలెన్స్ కానిస్టేబుల్ గూడెల్లి ప్రేమలత తన జన్మదినం సందర్భంగా విద్యార్థులకు డిక్షనరీలతోపాటు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. తహసీల్దార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్రవంతి, ఆర్గనైజేషన్ ఫౌండర్ సిరికొండ విక్రమ్‌కుమార్, ప్రతినిధులు రాజేష్, చరణ్, సాగర్ పాల్గొన్నారు.

డబ్బుల విషయంలో ఘర్షణ.. కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: డబ్బుల విషయంలో శుక్రవారం ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సీత్లా తండా గ్రామానికి చెందిన అజ్మీరా సురేష్ తన మిత్రుడైన అజ్మీరా అనిల్‌కు పది రోజుల క్రితం రూ.3వేల నగదును చేతి బదులుగా ఇచ్చాడు. ఈ క్రమంలో సురేష్ తన డబ్బులు ఇవ్వమని అనిల్ ఇంటికి వెళ్లగా ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన సురేష్ అక్కడే ఉన్న గడ్డపారతో సునీల్‌పై దాడిచేశాడు. తీవ్రగాయాలైన అనిల్ తండ్రి అజ్మీర కిషన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సురేష్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కురవి: మండలంలోని బలపాల గ్రామంలో జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతూ చెన్నబోయిన వీరన్న అనే వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. ఈమేరకు బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ శుక్రవారం పరామర్శించారు.

సంక్షిప్త సమాచారం

వార్డు సమస్యలు పరిష్కరించాలి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 23, 23, 20 వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చింతకుంట్ల వెంకన్న డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కాలనీలను సందర్శించి ప్రజల సమస్యలను శుక్రవారం అడిగి తెలుసుకున్నారు.

గౌడలు అన్నిరంగాల్లో ఎదగాలి

తొర్రూరు: సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో గౌడలు అన్నిరంగాల్లో ఎదగాలని జైగౌడ్ ఉద్యమ సంఘం జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావుగౌడ్ అన్నారు. ఈనెల 24న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

డోర్నకల్: డోర్నకల్‌లోని ఓ పాత హోటల్‌లో శుక్రవారం అక్రమంగా నిల్వ చేసిన 28 బస్తాల రేషన్ బియ్యాన్ని మహబూబాబాద్ టాస్క్‌ఫోర్స్, డోర్నకల్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. సుశీల్‌కుమార్‌జైన్, దేవావత్ శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంతోష్‌రావు తెలిపారు. కార్యక్రమంలో సీఐ చంద్రమౌళి పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల

మహబూబాబాద్ అర్బన్: శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను ప్రైవేట్ భవనంలో నడపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. జిల్లా కేంద్రంలోని పత్తిపాక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల షిఫ్టింగ్ చేస్తున్న క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు.

విరాళాల సేకరణ

నెహ్రూసెంటర్: కేరళ వరద బాధితుల కోసం సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో విరాళాల సేకరణ శుక్రవారం చేపట్టారు.

బియ్యం లారీ పట్టివేత

గూడూరు: బియ్యం బస్తాలతో వెళ్తున్న లారీని శుక్రవారం రాత్రి ఎస్సై బి. గిరిధర్‌రెడ్డి పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్సైని అడగ్గా లోడ్‌తో వస్తున్న లారీకి ఎలాంటి పత్రాలు లేవని, దీంతో అనుమానంతో స్టేషన్‌కు తరలించి సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏఎస్సై

కురవి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా జి.వెంకన్న శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. కొన్నేళ్లుగా ఇంటెలిజెన్స్‌లో విధులు నిర్వహించిన వెంకన్న ఇటీవల ఏఎస్సైగా పదోన్నతి పొందాడు.

సన్మానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆదివాసీ విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో వైద్యుడు చింతం రమేష్, డోలి సత్యనారాయణ, అధికారి శ్రీపతి, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

'నాణ్యమైన భోజనం పెట్టడం లేదు'

కురవి: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో నెలకొన్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో స్కూల్ గేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కోకన్వీనర్ గంధసిరి జ్యోతిబసు మాట్లాడుతూ.. గురుకులంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడంలేదని ఆరోపించారు.

సాలార్‌తండాలో సమస్యలు..

మహబూబాబాద్: సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని సాలార్‌తండా సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు.

గోవుల తరలింపు

తొర్రూరు: కురవి మండలం నుంచి అక్రమంగా తరలిస్తున్న గోవుల లారీని పోలీసులు పట్టుకుని స్థానిక గోశాలకు తరలించారని తొర్రూరు గోశాల అధ్యక్షుడు దారం కుమారస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్ర అశోక్‌రెడ్డి శుక్రవారం తెలిపారు.

రోడ్డు నిర్మించాలని నిరసన

కురవి: తక్షణమే రోడ్డు నిర్మించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ(పెద్దచంద్రన్న) రాష్ట్ర నాయకుడు ఆరెల్లి కృష్ణ అన్నారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తూరు(జీ) శివారు బంచరాయి తండాలోని లిఫ్టుకు వెళ్లే బురద రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు.

బహుమతుల అందజేత

కొత్తగూడ: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బోదకాలు నిర్మూలన అంశంపై వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుక్రవారం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో బహుమతులను అందజేశారు. శివప్రసాద్, లక్ష్మీనారాయణ, లలిత, పాల్గొన్నారు.